క్లుప్తంగా

విద్యార్థులు శ్రమించి లక్ష్యాన్ని చేరుకోవాలి



పెనమలూరు: విద్యార్థులు శ్రమించి లక్ష్యం చేరుకోవాలలని విజయవాడ పోలీస్ కమిషనరేట్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌతమిశాలి అన్నారు. కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం విద్యార్థుల కేబినేట్ ప్రమాణ స్వీకారం, ఫ్రెషర్స్ డే సందర్భంగా ఆమె పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. విద్యార్థులు లక్ష్యం పట్ల అవగాహన ఉండాలన్నారు. ఇష్టంతో, సంతోషంగా ప్రయత్నించి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో క్రమశిక్షణతో కృషి చేయాలన్నారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. బాధ్యత గల పౌరులుగా ఎదగాలని కోరారు. కేబినేట్‌కు ఎంపికైన విద్యార్థులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ, ప్రిన్సిపాల్ మనోజ్‌కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయికృష్ణ, పూర్వ విద్యార్థి సంఘ కార్యదర్శి కాకాని తరుణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెనమలూరు: వణుకూరు గ్రామంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరు గ్రామం రామాంజనేయగుడి వద్ద అదే గ్రామానికి చెందిన బి.సాంబశివరావు మద్యం అక్రమంగా విక్రయిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. అతని వద్ద 15 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెనమలూరు: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం వణుకూరు మద్దూరు రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఇసుక లోడ్‌తో ట్రాక్టర్ వచ్చింది. ట్రాక్టర్‌ను ఆపగా డ్రైవర్ ట్రాక్టర్‌ను ఆపకుండా వేగంగా వెళ్లిపోయాడు. పోలీసులు ట్రాక్టర్‌ను వెంబడించి పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ దత్తి ఉమాశంకర్‌ను ప్రశ్నించగా ఇసుక రొయ్యూరు నుంచి తీసుకు వస్తున్నానని, ట్రాక్టర్ యజమాని లుక్కా రాజేష్ అని తెలిపారు. పోలీసులు ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

జీవ శిలీంద్ర నాశినితో ప్రయోజనాలు



ఉయ్యూరు: జీవ శిలీంద్ర నాశినితో పైర్లకు మేలు జరుగుతుందని కేంద్ర సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారుల బృందం డాక్టర్ ప్రేమ రంజిత, సురేష్ తెలిపారు. మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం విజయవాడ ఆధ్వర్యంలో ఉద్యానశాఖ, వ్యవసాయశాఖల సంయుక్త ఆధ్వర్యంలో కూరగాయలు, వరిలో జీవ శిలీంద్రనాశిని వినియోగం వల్ల కలిగే లాభాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెగుళ్ల వ్యాప్తిని అరికట్టేందుకు, పైరు సంరక్షణకు జీవ శిలీంద్ర నాశని దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి నాగదేవిశ్రీ, ఏఓ నిస్సిగ్రేస్, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేస్తాం

- కౌన్సిల్‌లో వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు
- 2019-24 మధ్య జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించేందుకు నిర్ణయం



ఇంటి పన్నుల రీ సర్వేపై మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ కౌన్సిలర్ సుధారాణిని ప్రశ్నిస్తున్న వైస్ చైర్మన్లు సోలే, బేగం, కౌన్సిలర్లు

ఉయ్యూరు: ఉయ్యూరులో 2019 -24 మధ్య జరిగిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. అజెండాలోని అంశాలను ఆర్ఐ రఘు సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు మాట్లాడుతూ.. కాలేజీ రోడ్డులో వాటర్ ట్యాంకు నిర్మాణంలో ఎందుకు జాప్యం జరుగుతుందని ప్రశ్నించారు. ఉయ్యూరులో జరిగిన అభివృద్ధిపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. 2019-24 మధ్య ప్రభుత్వ పాలనలో ఉయ్యూరు మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వచ్చే కౌన్సిల్ సమావేశానికి సమగ్ర సమాచారంతో నివేదించాలని అధికారులకు స్పష్టం చేశారు. జరిగిన వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సి ఉందన్నారు. టీడీపీ కౌన్సిలర్ పంద్రాజు సుధారాణి వాదనకు దిగారు. సోలేతో పాటు మరో వైస్ చైర్‌పర్సన్ అర్షతున్నీసాబేగం, కో ఆప్షన్‌సభ్యుడు షేక్ ఖలీల్, వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులు టీడీపీ సభ్యురాలు సుధారాణి వాదనను తప్పుపట్టారు. అభివృద్ధి ఏం జరిగిందో అదే చెబుతామంటే ఎందుకు తొందరపడుతున్నారని ప్రశ్నించారు. 'నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అంటూ, ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేలు అన్నారు కదా?, ఎక్కడిచ్చారు?, ఎప్పుడిస్తున్నారు?, సూపర్‌సిక్స్ ఏమైంది?, మహిళలకు నెలకు రూ.1500 అన్నారు అదెక్కడ?, 'అంటూ నిలదీశారు. సమావేశం అనంతరం కూడా సభ్యులు పథకాలపై వాదులాడుకోవటంతో చైర్మన్ వల్లభనేని నాని సర్ది చెప్పారు.

ఇంటి పన్నులపై రీ సర్వే..

ఇంటి, నీటి పన్నులపై రీ సర్వే చేపడుతున్నామని కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు అన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రీ సర్వేకు సభ్యులు, ప్రజలు సహకరించాలన్నారు. ఇంటి, నీటి పన్నులను క్రమబద్ధీకరించి పారదర్శకంగా పన్నులు విధించేందుకు సర్వే చేస్తున్నామన్నారు. సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి సభ్యులు ఆమోదం తెలిపారు.

నెప్పల్లిలో ఉద్రిక్తత

- పోరంబోకు స్థలంలో ఇళ్లు తొలగింపునకు పూనుకున్న అధికారులు
- అడ్డుకున్న స్థానికులు



నెప్పల్లిలో కొలతలు వేస్తున్న అధికారులు

కంకిపాడు: రోడ్డు పోరంబోకు స్థలంలో పేదలు నిర్మించుకున్న ఇళ్ల తొలగింపునకు అధికారులు చేసిన సన్నాహాలు ఉద్రిక్తతకు దారితీశాయి. ఇళ్ల తొలగింపునకు వచ్చిన అధికారులకు బాధిత కుటుంబాలు అడ్డుకున్నాయి. తమకు ప్రత్యామ్నాయం చూపాలని నిలదీశారు. మధ్యేమార్గంగా రోడ్డు మార్జిన్‌కు ఇబ్బంది లేకుండా నివాసాలను తాత్కాలికంగా ఏర్పాటు చేసుకోవాలని అధికారులు ఇచ్చిన సూచనలతో సమస్య సద్దుమణిగింది. మండలంలోని నెప్పల్లి గ్రామంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఇళ్ల తొలగింపు చర్యలు, నోటీసుల జారీ వ్యవహారంలో టీడీపీ పాత్ర ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

నివాసాల తొలగింపునకు నోటీసులు

వివరాల్లోకి వెళితే... నెప్పల్లి గ్రామానికి చెందిన పేద కుటుంబాలు గ్రామంలోని రోడ్డు మలుపులోని పోరంబోకు స్థలంలో సుమారు ఐదు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారు. ఎన్నికలకు ముందు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఈ నివాసాల్లోని పలు గృహాలు అగ్ని ప్రమాదంలో కాలిబూడిదయ్యాయి. ప్రస్తుతం ఈ స్థలాల్లో ఆ కుటుంబాలు తిరిగి నివాసాలు ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్నాయి. రోడ్డు పోరంబోకు స్థలాల్లో ఉన్న ఈ నివాసాల తొలగింపునకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇందులో భాగంగానే ఇళ్ల తొలగింపునకు అధికారులు బుధవారం రంగంలోకి దిగారు. భారీ బందోబస్తు నడుమ ప్రొక్లెయిన్‌ను నివాసాల తొలగింపు ప్రాంతానికి చేర్చటంతో బాధిత కుటుంబాలు ఆందోళనకు గురయ్యాయి. మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ల దృష్టికి సమస్య తీసుకెళ్లారు. తహసీల్దార్ ఎం.రామకృష్ణ తమ సిబ్బందితో గ్రామానికి చేరుకుని విచారణ జరిపారు. రోడ్డు మార్జిన్‌కు ఉన్న నిర్మాణాల కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని స్పష్టంచేశారు. నివాసాలు ఉన్న వారికి సొంత స్థలాలు ఉన్నాయని సూచించారు. రోడ్డు మార్జిన్ విడిచి నిర్మాణాలు తాత్కాలికంగా ఉంచుకోవాలని స్పష్టంచేశారు. దీనికి బాధితులు సమ్మతించారు. నెప్పల్లి - కుందేరురోడ్డుకు నాలుగు మీటర్లు విడిచి నిర్మాణాలు చేసుకోవాలని తహసీల్దార్ రామకృష్ణ మధ్యేమార్గంగా ఇచ్చిన సూచనలతో బాధితులు అంగీకరించటంతో సమస్య సద్దుమణిగింది.

టీడీపీ నేతల ఒత్తిడే కారణం

పేదల నివాసాల తొలగింపు చర్యల్లో టీడీపీ నేతల పాత్ర ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ నేతల ప్రమేయం వల్లే అధికారులు నోటీసులు జారీ చేశారని, ఆ ఒత్తిడి మేరకు అధికారులు రంగంలోకి దిగారని తెలుస్తోంది. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పేదలపై ప్రతాపాన్ని ప్రదర్శిస్తుందన్న విమర్శలు ఉన్నాయి. సీఐటీయూ నేత తాడంకి నరేష్ బాధితులకు అండగా నిలిచారు. పేదల పక్షాన నిలిచి న్యాయం చేయాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ స్థలాలను ఇవ్వాలని కోరారు.

అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బోడెప్రసాద్

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బోడెప్రసాద్ చెప్పారు. ఆయన పోరంకిలో తన కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద పెనమలూరు నియోజకవర్గానికి రూ.23 కోట్లు నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, పాఠశాలలకు ప్రహారీలు, శ్మశాన వాటికల అభివృద్ధి, గోకులం షెడ్లు నిర్మాణం చేయాలన్నారు. గ్రామాల్లో ప్రాధాన్యత క్రమంలో అంతర్గత రహదారులు అభివృద్ధి చేయటానికి క్షేత్ర స్థాయిలో పరిశీలించి అంచనాలు రూపొందించాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ ఎంపీడీఓలు కుమార్‌బాబు, లక్ష్మిదేవి, భాస్కర్, పీఆర్ డీఈ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎల్.నారాయణరావు, ఏఈలు, ఇంజినీరింగ్ సిబ్బంది, ఉపాధి అధికారులు పాల్గొన్నారు.

బాలాంబ అమ్మవారికి సారె సమర్పణ



ఉంగుటూరు: మానికొండలో గ్రామ దేవత శ్రీబాలాంబ అమ్మవారికి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఆషాఢ సారెను బుధవారం సమర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని అమ్మవారికి సారెను సమర్పించారు. రాష్ట్ర భవిష్యత్ బాగుండాలని ప్రత్యేకంగా వేడుకున్నారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మడిచర్లలో పశువైద్య శిబిరం



హనుమాన్‌జంక్షన్ రూరల్: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ(గన్నవరం) ఆధ్వర్యంలో బాపులపాడు మండలం మడిచర్లలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన పశు వైద్యశిబిరాన్ని సర్పంచ్ అజ్మీరా శాంతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు అజ్మీరా నాగలక్ష్మిలు ప్రారంభించారు. పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రావణ్‌కుమార్, బాపులపాడు ప్రభుత్వ పశు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ వై.హరిత, డీఎల్‌డీఏ గన్నవరం పశువైద్యురాలు అనామికా నేతృత్వంలో 85 పశువులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

విజయవాడరూరల్: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లోని పింఛన్‌దారులకు గురువారం నుంచి పింఛన్ల నగదు అందజేస్తామని ఎంపీడీఓలు తెలిపారు. రామవరప్పాడు పటేల్ నగర్‌లో జరిగే ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల కార్యక్రమంలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొంటారని ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు తెలిపారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని ఆయన చెప్పారు.

పింఛన్లు సకాలంలో పంపిణీ చేయాలి

పెనమలూరు: సామాజిక పింఛన్లను ఆగస్టు 1వ తేదీ గురువారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అధికారులు, సిబ్బంది సకాలంలో పంపిణీ చేయాలని ఎంపీడీఓ కుమార్‌బాబు ఆదేశించారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన తరువాత గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. పింఛన్ లబ్ధిదారులకు వేకువజామునే పింఛన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసిందని తెలిపారు. పింఛన్లు పంపిణీ చేసే విషయంలో నిర్లక్ష్యం చూపరాదన్నారు. మొదటి రోజే 99 శాతం పింఛన్లు పంపిణీ చేయాలని సూచించారు. పింఛన్ల పంపిణీ పూర్తి బాధ్యత సచివాలయాల సిబ్బందిదేనని స్పష్టం చేశారు.

సామాజిక పింఛన్ సొమ్ము విడుదల

పెనమలూరు: సామాజిక పింఛన్ సొమ్ము ప్రభుత్వం విడుదల చేసిందని అధికారులు బుధవారం తెలిపారు. మండల పరిధిలో 18,536 వివిధ రకాల పింఛన్లు ఉన్నాయి. వీటికి గాను ప్రభుత్వం రూ.7,83,99,500 కోట్ల నిధులు విడుదల చేసింది. గ్రామాల్లో గురువారం పింఛన్లు పంపిణీ చేయటానికి ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

గ్రామపటాన్ని రూపొందించిన వ్యవసాయ విద్యార్థులు

కంకిపాడు: సాగు పద్ధతులపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించటంతో పాటు విద్యార్థులు కూడా సాగుపై అవగాహన కలిగి ఉండాలని చలివేంద్రపాలెం సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి తెలిపారు. కె.ఎల్.యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు గ్రామీణ పనులు అవగాహన-అనుభవ కార్యక్రమం కింద చలివేంద్రపాలెం గ్రామానికి బుధవారం వచ్చారు. మూడు నెలల పాటు సాగే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు స్థానిక కల్యాణ మండపంలో గ్రామపటాన్ని ప్రదర్శించారు. శిక్షణలో ప్రొఫెసర్లు డాక్టర్ పి.అవినాష్, డాక్టర్ జి.సురేష్, డాక్టర్ కిరణ్, డాక్టర్ ఉదయ్, విద్యార్థులు వి.అశోక్‌కుమార్‌రెడ్డి, వి.మహేష్, జి.హర్షసాయి, ఎం.నాగమహేంద్రరెడ్డి, ఎం.జనార్దన్‌రెడ్డి, డి.సాకేత్, షేక్ షాకీర్ అక్రమ్, ఎం.కృష్ణప్రసాద్, యు.సాయిరాం, సయ్యద్ సొహైల్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

నున్న(విజయవాడరూరల్): గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు బుధవారం ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామ సచివాలయాల్లో వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయంతో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. నున్న, అంబాపురం, పి.నైనవరం పాతపాడు గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మండల ప్రత్యేక అధికారి డి.వి. రమణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు పర్యవేక్షించారు. పైప్‌లైన్ లీకేజీలను రిపేరు చేయాలని ఆదేశించారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులను నిర్వహించారు.

పారిశుద్ధ్యం నిర్వహణపై తనిఖీ

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణపై మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. కానూరు, పోరంకి సెక్టార్లలో క్షేత్రస్థాయిలో పరిశీలించి పారిశుద్ధ్య కార్మికులకు ఆయన తగిన సూచనలు చేశారు. డ్రెయిన్లు ఎప్పటికప్పుడు పూడిక తీయాలన్నారు. డోర్ టూ డోర్ చెత్త సేకరణ చేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారులు ప్రతి రోజు శుభ్రం చేయడంతో పాటు చెత్త కుప్పలు వెంటనే తొలగించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడంతో ఆపటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

పారిశుద్ధ్య పనుల నిర్వహణకు టెండర్ ఖరారు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు పంచాయతీ కార్యాలయంలో బుధవారం పారిశుద్ధ్య పనుల నిర్వహణ నిమిత్తం ఆహ్వానించిన టెండర్లలో తక్కువ ధరకు కోట్ చేసిన గ్రామానికి చెందిన కోలపల్లి ఉదయ్ కిరణ్‌కు టెండర్ ఖరారైంది. 2024-25 సంవత్సరానికి గ్రామంలో పారిశుద్ధ్య పనుల నిర్వహించేందుకు ఇటీవల టెండర్లు ఆహ్వానించారు. తొలుత గ్రామానికి చెందిన వేమినేని కిషోర్, తుమ్మల రమేష్‌లు టెండర్లు సమర్పించగా మెజార్టీ పాలకవర్గ సభ్యులు ఓటింగ్ పద్ధతి ద్వారా వీరిని వ్యతిరేకించిన విషయం విదితమే. ఈ సీల్డ్ టెండర్లను పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు సమక్షంలో ఓపెన్ చేసి తక్కువ ధరకు కోట్ చేసిన కోలపల్లి ఉదయ్ కిరణ్(రూ.388.74) పేరును ప్రకటించారు.

తహసీల్దార్లకు మండలాల కేటాయింపు

- ఇతర జిల్లాల నుంచి వచ్చిన 35 మందికి పోస్టింగ్స్
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం(మచిలీపట్నం): జిల్లాలో 35 మంది తహసీల్దార్లకు స్థానాలు కేటాయిస్తూ కలెక్టర్ బాలాజీ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కృష్ణా జిల్లాలో పనిచేస్తూ తూర్పు, పశ్చిమ ఉమ్మడి గోదావరి జిల్లాలకు బదిలీ అయ్యారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో ఆ జిల్లాల నుంచి కృష్ణా జిల్లాకే కేటాయించారు. సీహెచ్ వీరాంజేయ ప్రసాద్(కలెక్టరేట్ ఏఓ), పీఎస్‌వీ ప్రసాద్(కలెక్టరేట్ మేజిస్టీరియల్ సెక్షన్), బి.నెల్సన్ పాల్‌బాబు(కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్), కె.ఆంజనేయులు (కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సెక్షన్), కె.సత్య సులోచన (కలెక్టరేట్ ల్యాండ్ ప్రొటెక్షన్), జె.విమల కుమారి(కలెక్టరేట్ ల్యాండ్ ఆథరైజ్డ్ ఆఫీసర్), ఏఎస్ఎన్ రాధిక(కలెక్టరేట్ ఎల్‌ఏపీడబ్ల్యూడీ స్కీమ్స్), షేక్ లతీఫ్ పాషా (ఏఓ, ఆర్డీఓ కార్యాలయం మచిలీపట్నం), డి.ప్రశాంతి (మచిలీపట్నం ఆర్డీఓ కార్యాలయ కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ తహసీల్దార్), సీహెచ్ నరసింహారావు (ఏఓ, గుడివాడ ఆర్డీఓ కార్యాలయం) డి.సునీల్‌బాబు (ఏఓ, ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయం), వి.నాగభూషణ(బాపులపాడు), ఎస్. సీతపవన్ కుమార్ (గన్నవరం), వి.రామకోటేశ్వరరావు (గుడివాడ), టి. మల్లికార్జున రావు (గుడ్లవల్లేరు), బి.రామానాయక్ (నందివాడ), వీవీ భరత్‌రెడ్డి (బంటుమిల్లి), డి.రాజ్యలక్ష్మీ (గూడూరు), కేజీఎస్ సోమేశ్వరరావు (కృత్తివెన్ను), అబ్దుల్ రెహమన్ మస్తానా (పెడన), పి.మధుసూదన్‌రావు (మచిలీపట్నం సౌత్), జి.మురళీధర్ (అవనిగడ్డ), డి.వనజాక్షి (చల్లపల్లి), బి.విజయప్రసాద్ (ఘంటసాల), బి.శ్రీనునాయక్ (కోడూరు), ఎం.శ్రీవిద్య (మోపిదేవి), ఎం హరనాథ్ (నాగాయలంక), కె.మస్తాన్ (మొవ్వ), జి.రవికాంత్ (పామర్రు), కె.నవీన్‌కుమార్ (పమిడిముక్కల), వై.రంగారావు (పెదపారుపూడి), ఎం. కుసుమకుమారి (తోట్లవల్లూరు), వి.భావన్నారాయణ (కంకిపాడు), కె.గోపాలకృష్ణ (పెనమలూరు), ఎం.సురేష్‌కుమార్ (ఉయ్యూరు) స్థానాలను కేటాయించారు.

పోయినది

తుమాటి రామలింగేశ్వరరావు, S/o. సుబ్బయ్య, కొయ్యూరు, బాపులపాడు మండలం, వీరికి సంబంధించిన డాక్యుమెంట్ నెంబర్ 17/1975 కొయ్యూరు నుండి హనుమాన్‌జంక్షన్ వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పోయినది. దొరికిన వారు క్రింది నెంబర్‌కు సంప్రదించి అందజేయగలరు. సెల్: 9640369777

శాకంబరీదేవిగా మహంకాళీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని త్రిశక్తి పీఠంలో కాళీమాత అమ్మవారు బుధవారం శాకంబరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో వేంచేసి ఉన్న మహంకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతి దేవి అమ్మవార్లను కూరగాయలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించారు.